క్లుప్తంగా

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



చేబ్రోలు: చిన్నప్పటి నుంచి గణిత శాస్త్రంపై దృష్టి పెట్టడం విద్యార్థులకు ఎంతో అవసరమని, గణితాన్ని రోజూ ప్రాక్టీస్ చేస్తే పెద్ద తరగతులలో ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఉంటుందని ప్రెసిడెన్సీ హైస్కూల్ డైరెక్టర్ వి.బన్‌బాబు అన్నారు. గుంటూరు జిల్లా స్థాయిలో నిర్వహించిన అబాకస్ పోటీలలో మండల కేంద్రమైన చేబ్రోలులోని ప్రెసిడెన్సీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి అవార్డులు పొందినట్లు సోమవారం ప్రిన్సిపాల్ వి.ఆశాలత తెలిపారు. జిల్లా స్థాయి అబాకస్ జూనియర్ లెవల్-3 పోటీలో ఎం.మనస్విని ప్రథమస్థానం సాధించించగా స్టార్ జూనియర్ లెవల్-3లో టి.వేదాన్ష్ కోటి ద్వితీయ స్థానం, జూనియర్ లెవల్-1లో వి.ఈశ్వర్ మూడో స్థానం సాధించి మెమోంటోలు, సర్టిఫికెట్లు పొందినట్లు చెప్పారు.

కేఎస్ లక్ష్మణరావుకు పట్టభద్రులు మద్దతు ఇవ్వాలి

చేబ్రోలు: కృష్ణ- గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ కోరారు. చేబ్రోలులోని ఉపాధ్యాయ భవన్‌లో ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాల నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలపై ఐదేళ్లుగా పోరాటం చేసిన వ్యక్తి కేఎస్ లక్ష్మణరావు అన్నారు. జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి కేఎస్ లక్ష్మణరావు అనేక పోరాటాలు చేశారన్నారు. గ్రాడ్యుయేట్స్ మండల సమన్వయ కమిటీ కన్వీనర్‌గా ఐ.శ్రీనివాసరావు, కో కన్వీనర్‌గా సిహెచ్.హనుమంతరావులతో పాటు మరికొంతమందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

స్వచ్ఛాంధ్ర సాధనే లక్ష్యం



ప్రత్తిపాడు: స్వచ్ఛ ఆంధ్ర సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్-1 ఊర్మిళాదేవి అన్నారు. గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం, ప్రత్తిపాడు మండలం నడింపాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను సోమవారం రాత్రి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఊర్మిళాదేవి, బి.అర్జునరావు పరిశీలించారు. ఈ సందర్భంగా తడి చెత్త, పొడి చెత్త సేకరణ జరుగుతుందా? జిందాల్ పవర్ ప్లాంట్‌కు ఎన్ని టన్నులు తరలిస్తున్నారు? ఇంటింటికీ చెత్త సేకరణ చేస్తున్నారా? క్లాప్ మిత్రల పనితీరు, జీతాల చెల్లింపులు.. వంటి విషయాలను పంచాయతీ కార్యదర్శులు షేక్ ఖాజా, జి.వి.ఆర్కే మూర్తిలను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట డీపీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ పద్మారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్‌బాబు, జిల్లా ఐఈసీ కోఆర్డినేటర్ షేక్ షఫీ, మండల విస్తరణాధికారి జి.రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్‌కుమార్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఉచితంగా పరీక్షలు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ యశస్వి రమణ సోమవారం తెలిపారు. అందుబాటులో లేని వైద్య పరీక్షలను ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద అతి తక్కువ ధరలకే 'గ్లోబల్ డయాగ్నస్టిక్స్, మెడైకాన్' అనే సంస్థకి కాంట్రాక్ట్ ఇచ్చినట్లు చెప్పారు. కాంట్రాక్టు దక్కించుకున్న ల్యాబ్‌ల రిక్విజేషన్ ఫామ్స్ అన్ని వార్డుల్లో, ఓపీ కౌంటర్లలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. చాలా మంది జీజీహెచ్ పేరు చెప్పుకొని ఎక్కువ రేట్లకు రక్త పరీక్షలు చేయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు సంబంధిత ల్యాబ్ నుంచి మాత్రమే ఐడీ కార్డుతో వారి టెక్నీషియన్స్ రక్త నమూనాలను సేకరిస్తున్నారన్న విషయాన్ని గుర్తించాలని చెప్పారు. ఎవరూ కూడా బయట ల్యాబ్స్‌కు రక్త పరీక్షలు ఇచ్చి మోసపోవద్దని సూచించారు.

దుమ్ము రేగుతోంది..

- ఒక పక్క అధ్వాన రోడ్డు, మరో పక్క భారీ వాహనాలు
- మట్టి రోడ్లను తలపిస్తున్న తారురోడ్లపై నరకప్రాయంగా మారుతున్న ప్రయాణం
- ముందస్తు జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదమే
- కళ్లకూ, ఆరోగ్యానికీ ముప్పేనంటున్న వైద్యులు!



టిప్పర్ వెళ్తుండడంతో దుమ్ము, ఇబ్బందులు పడుతున్న ఆటో ప్రయాణికులు



ప్రత్తిపాడు: ఆ రోడ్లపై ప్రయాణం అంటేనే కళ్లు గగుర్పొడిచే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దుమ్ము దెబ్బకు రోడ్లపై కళ్లు మూసుకోవాల్సిందే. కారణం మట్టిరోడ్లను తలపించే తారురోడ్లు, భారీ వాహనాల రాకపోకలు, దుమ్ము, ధూళితో నిండిన మార్జిన్లు. ఈ అధ్వాన రోడ్లపై భారీ వాహనాల దెబ్బకు ప్రజలు, ప్రయాణికులపై దుమ్ము, రాళ్లు ఎగసెగసి పడుతున్నాయి.

భారీ వాహనాల తాకిడితో..

ప్రత్తిపాడు, చినకోండ్రుపాడు, నడింపాలెం, గొట్టిపాడు, యనమదల మార్గాలతో పాటు గుంటూరు- పర్చూరు పాత మద్రాసు రోడ్డు, 16వ నంబరు జాతీయ రహదారిపై అనేక పత్తి మిల్లులు, కంపెనీలు, ఇటుక బట్టీలు పరిశ్రమలు ఏర్పడటంతో పాటు, చిప్స్ క్వారీలు, బ్రిక్స్ బట్టీలు, తూముల తయారీ కంపెనీలు, కూల్‌డ్రింక్స్ తయారీ యూనిట్లు ఉన్నాయి. వీటికి తోడు గ్రావెల్ మైనింగ్ కూడా విపరీతంగా సాగుతోంది. టిప్పర్లు, భారీ వాహనాలు, కంటైనర్లు తాకిడి ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో ఉంటుంది. భారీ వాహనాల దెబ్బకు రహదారి మొత్తం దుమ్ముమయంగా మారుతోంది. అసలే మట్టి రోడ్లును తలదన్నే తారు రోడ్లులో, భారీ వాహనం వస్తుందంటేనే భయపడి కొద్దిసేపు ఆగాల్సిన పరిస్థితి వాహన చోదకులకు దాపురిస్తుంది. ఇదిలా ఉంటే డస్ట్‌లోడుతో వెళ్లే భారీ టిప్పర్లు, ట్రాక్టర్లు వాయువేగంతో దూసుకెళుతుండటంతో దుమ్ము సమస్య మరింత తీవ్రంగా ఉంది. కనీసం దుమ్ము పైకి లేవకుండా పట్టా కూడా కప్పని పరిస్థితులున్నాయి.

దుమ్ము వలన సోకే వ్యాధులు..

- దుమ్ము, ధూళిలో రోగకారక బ్యాక్టీరియా, ధూళి రేణువులు శ్వాస ద్వారా ఊపిరితిత్తుల్లోనికి వెళ్లి శ్వాసకోశ రుగ్మతలు సోకుతాయి.
- మట్టి రేణువుల్లో ఉండే మైక్రో బ్యాక్టీరియా ట్యూబర్ క్లోసిస్ సూక్ష్మజీవులు ఊపిరితిత్తుల్లోనికి వెళతాయి. తద్వారా దమ్ము, దగ్గు, క్షయ వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది.
- జలుబు, తుమ్ములు వస్తాయి.
- డస్ట్‌అలర్జీ ఏర్పడి గొంతులోని శ్వాసనాళాలకు ఇబ్బంది ఏర్పడుతుంది.
- శరీరంపై దుమ్ము పేరుకుపోవడం వలన చర్మ వ్యాధులు సోకుతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- దుమ్ము రహదారిపై ప్రయాణించే వారు తప్పనిసరిగా ముఖానికి మాస్కులు ధరించాలి.
- భారీ వాహనాల వెనుక ప్రయాణించడం మానుకోవాలి.
- ప్రత్నామ్నాయ మార్గాలను చూసుకోవాలి.
- కంటిసమస్యలు తలెత్తకుండా కళ్లజోళ్లను వినియోగించాలి.

శ్వాసకోశ వ్యాధులు వస్తాయి

దుమ్ము, ధూళి కారణంగా పలు రకాల శ్వాసకోశ వ్యాధులు వస్తాయి. సరైన సమయంలో చికిత్స చేయించుకోకుంటే క్షయ, ఊపిరితిత్తులుకు సమస్య వాటిల్లుతుంది. దుమ్ముతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లేదంటే అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుంది.

– మేరి యునిస్, వైద్యాధికారి, గొట్టిపాడు పీహెచ్‌సీ

జిల్లా కోర్టు ఆవరణలో సెమీక్రిస్మస్ వేడుకలు



నగరంపాలెం: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ది గుంటూరు బార్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతీ హాజర్తై ప్రసంగించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, విశ్రాంత జడ్జి ఎస్‌జేసు రత్నకుమార్, పాస్టర్ రెవరెండ్ వై.యోహాన్ రాజు మాట్లాడారు. ది గుంటూరు బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి అనూరాధ, కోశాధికారి దేవదాసు, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, సీనియర్ న్యాయవాదులు ఎం.నాగేశ్వరరావు, డేవిడ్, లూదర్‌బాబు, సుధాకర్ పాల్గొన్నారు.

అర్జీలకు వెంటనే పరిష్కారం

పొన్నూరు: వివిధ సమస్యలపై మండల ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ జియావుల్ హక్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. భూమి సర్వే, పాస్ బుక్ కోసం వచ్చిన 2 అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఏఓ దేగల వెంకట్రామయ్య, సీడీపీఓ వెంకటరమణ, డీటీ రాజా రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో ముగ్గురు గాయపడిన ఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో సోమవారం చోటుచేసుకుంది. చేబ్రోలు ప్రాంతానికి చెందిన నాగిశెట్టి నాగేశ్వరరావు, కల్యాణి దంపతులు మనవరాలు హరిష్మితతో కలసి ద్విచక్ర వాహనంపై పోలీసు స్టేషన్ సమీపంలోని షాపు వద్దకు బయలుదేరారు. మార్గ మధ్యలో స్థానిక జెండా చెట్టు సమీపంలో ఎదురుగా బైక్ అతివేగంగా వచ్చిన ఢీ కొట్టింది. ఈ ఘటనలో టీవీఎస్‌పై ఉన్న నాగేశ్వరరావు దంపతులతో పాటు మనవరాలకు తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురిని 108 వాహనం ద్వారా గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

30 నుంచి దశావతార కల్యాణ మహోత్సవాలు



దశావతార కల్యాణ మహోత్సవాల బ్రోచర్‌లు, వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం(పెద్దగుడి)లో ఈనెల 30వ తేదీ నుంచి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన సొసైటీ ఆధ్వర్యంలో దశావతార కళ్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల అంజనేయులు తెలిపారు. సోమవారం గ్రామంలోని ఆలయంలో ఏర్పాటు చేసిన దశావతార బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పది రోజులపాటు నిర్వహించే ఈ మహోత్సవాలలో మన రాష్ట్రంలో ఏ వైష్ణవాలయంలో జరగని విధంగా వైభవంగా కళ్యాణ మహోత్సవాలు జరుగుతాయని చెప్పారు. ప్రతి రోజు ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ప్రత్యేక హోమాలు నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు. 30వ తేదీన మత్స్యవతార కళ్యాణం, 31వ తేదీన కూర్మావతార కళ్యాణం, జనవరి 1వ తేదీన వరాహావతార, 2న నరశింహావతార, 3న వామనావతార కళ్యాణం, 4వ తేదీన పరశురామవతార కళ్యాణం, 5వ తేదీన రామావతార కళ్యాణం, 6వ తేదీన బలరామావతార, 7వ తేదీన శ్రీ కృష్ణావతార, 8వ తేదీన శ్రీ వేంకటేశ్వరస్వామి అవతార కళ్యాణం జరుగుతుందన్నారు. 10 తేదీన ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఉత్తరద్వార దర్శనం, 13వ తేదీన గోదాదేవి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్, ఉపాధ్యక్షులు ఆళ్ళ శివారెడ్డి, గజవల్లి శివన్నారాయణ, కార్యవర్గ సభ్యులు కెవి రెడ్డి, దేవరశెట్టి సురేష్, ఓబుల్‌శెట్టి వెంకటనారాయణ, దేవరశెట్టి సుబ్బారావు, కూనిశెట్టి శ్రీనివాసరావు, సూరే శ్రీనివాసరావు, పూసల శివయ్య, జవ్వాది సుబ్బారావు, జల్లేపల్లి మునలయ్య, కటకంశెట్టి శివరామకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రాజెక్టులకు అంగీకారం

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగీకారం తెలిపారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రత్తిపాడు నియోజకవర్గ గ్రామ పార్టీ, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉండాలన్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ ఈ నెల31వ తేదీతో ముగియనుందని, రానున్న వారం రోజుల్లో పార్టీ క్యాడర్ కష్టపడి పనిచేసి సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. సీఎం ఆశీస్సులతో ప్రత్తిపాడు నియోజకవర్గంలో గుంటూరు చానల్, నల్లమడ ఆధునికీకరణ, ఎకనామిక్స్ జోన్, పాత మద్రాస్ రోడ్డు విస్తరణ ప్రాజెక్టులకు అంగీకారం తెలిపారని, త్వరలోనే కార్యరూపంలో దాల్చుతాయని బూర్ల ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా రైతుల కోసం కాకుమానులో ప్రైవేట్ భాగస్వామ్యంతో వ్యవసాయ ఆధునికీకరణ పద్ధతుల రీసెర్చ్ సెంటర్ అందుబాటులోకి రానున్నదన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన పువ్వాడి వెంకటమహేష్

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి, ఉపాధ్యాయునికి లక్ష్యసాధనలో తమవంతు కృషి ఎల్లప్పుడూ చేస్తామని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పువ్వాడి వెంకటమహేష్‌కు తమిళనాడులోని అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. మాక్సిమమ్ పవర్ పాయింట్ ట్రాకింగ్ ఆఫ్ సోలార్ ఫోటోవోల్టాయిక్ సిస్టమ్స్ త్రూ రిగ్రషన్ బేస్డ్ మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్స్ అనే అంశంపై అన్నామలై విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ ఎస్.మేయప్పన్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ పొందారన్నారు. కళాశాలలో పీహెచ్‌డీ కలిగిన స్టాఫ్ మొత్తం 153 మంది న్నారని తెలిపారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె.చంద్రశేఖర్ అభినందించారు.

అధికారులు స్పందించడం లేదని.. ఆర్టీఐ బాట



ఇది ప్రభుత్వ భూమి అంటూ గతంలో అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

గుంటూరు: పంచాయతీ రోడ్డు ఆక్రమణకు గురవుతోంది.. పంచాయతీ నిధులతో వేసిన రోడ్డును ఆక్రమించి గుడికి ప్రహరీ కడుతున్నారు.. విచారించి చర్యలు తీసుకోమని అధికారులకు ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదుదారులు ఆర్టీఐ బాట పట్టారు. ఫిర్యాదుదారులు తెలిపిన ప్రకారం వివరాలు.. ప్రత్తిపాడులోని 755-01 సర్వే నంబరులో ఉన్న చెరువు పొరంబోకుతో పాటు పంచాయతీ రోడ్డు ఆక్రమణకు గురవుతున్నాయంటూ జెట్టి భాస్కరస్వామి, జెట్టి లక్ష్మీనారాయణ 2021 నుంచి పంచాయతీ కార్యదర్శి, తహసీల్దార్ మొదలు జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్లు నిర్వహించే గ్రీవెన్స్ వరకు అనేక సార్లు అర్జీల ద్వారా, 1902కు కాల్ చేసి సమస్యను విన్నవించారు. గతంలో ఓ సారి రెవెన్యూ అధికారులు విచారణకు వెళ్లి ఇది ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఆ బోర్డులు తీసేసి, పంచాయతీ రోడ్డును ఆక్రమించి కొందరు గుడి ప్రహరీ కడుతున్నారంటూ కొద్ది రోజుల కిందట మళ్లీ లక్ష్మీనారాయణ అధికారులకు మరోసారి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. అధికారులు వచ్చి చూసి వెళుతున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఫలితం లేకపోవడంతో ఎవ్వరికి చెప్పుకోవాలో అర్థం కాక ఫిర్యాదుదారులు ఆర్టీఐ బాట పట్టారు. సమాచార హక్కు చట్టం కింద పూర్తి వివరాలను అందించాలంటూ ఈ నెల 13వ తేదీన లక్ష్మీనారాయణ, 17వ తేదీన భాస్కరస్వామి స.హ.చట్టం కింద ఆయా శాఖల అధికారులకు దరఖాస్తులు చేశారు. అయితే ప్రహరీ కట్టడం వలన పంచాయతీ వాళ్లు వేసిన వాటర్ పైప్‌లైన్, రోడ్డు, దారి కూడా ఆక్రమణకు గురవుతుందని, విద్యుత్ పోల్ కూడా పీకివేశారని, వాగును కూడా పూడ్చారని ఫిర్యాదుదారులు చెబుతున్నారు.

ఊరూవాడా క్రిస్మస్ సందడి



పెదకాకానిలో విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న క్రీస్తు కృపాలయం చర్చి



చర్చి ఆవరణలో అలంకరించిన పశువుల పాక, క్రీస్తు జననం సన్నివేశం

పెదకాకాని: క్రిస్మస్ సందడి ఊరూవాడా నెలకొంది. మంగళవారం రాత్రి నుంచే వేడుకలకు చర్చిలు ముస్తాబు చేస్తున్నారు. చర్చిలను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించడంతో కొత్త శోభను సంతరించుకున్నాయి. గత కొద్ది రోజులుగా క్రైస్తవులు, విశ్వాసులు క్రిస్మస్ ఆగమనాన్ని పురస్కరించుకొని చర్చిల్లో, తమ ఇళ్లల్లో సెమీక్రిస్మస్, మినీ క్రిస్మస్ పేరిట ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. జెరుసలేంలోని బెత్లహాంలో ఓ పశువుల పాకలో ఏసు ప్రభువు జన్మించారు. అందుకు గుర్తుగా క్రైస్తవులు తమ ఇళ్లల్లో, చర్చిల్లో క్రీస్తు జననానికి చిహ్నంగా పశువుల పాకలను ఏర్పాటు చేసుకుని క్రీస్తు జననం సన్నివేశాలను అలంకరించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని చర్చిల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా పాస్టర్లు క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలియ జేస్తున్నారు. అలానే యువత, సండేస్కూల్ విద్యార్థులు క్రిస్మస్‌ను స్వాగతించేందుకు పాటలను సాధన చేస్తున్నారు.

క్రిస్మస్ ట్రీకి ఎంతో ప్రాధాన్యం

క్రిస్మస్ వేడుకల్లో క్రిస్మస్ ట్రీకి కూడా క్రైస్తవులు, విశ్వాసులు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని క్రైస్తవులు, విశ్వాసులు విధిగా తమ ఇళ్లల్లో, ఇంటి ముంగిట క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేస్తారు. ప్రపంచ దేశాల్లో ఒక్కొక్క దేశంలో క్రిస్మస్ ట్రీకి సంబంధించి పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఆధునిక జర్మనీ ఏర్పడిన తరువాత క్రిస్మస్ ట్రీ ప్రాచుర్యంలోకి వచ్చినట్లు క్రైస్తవులు చెబుతున్నారు. 16వ శతాబ్దంలో మార్టిన్ లూథరన్ మొదటిసారిగా ఎవర్ గ్రీన్ అనే చెట్టును కొవ్వొత్తులతో అలంకరించారంటారు. నిత్యజీవనానికి సంకేతంగా క్రిస్మస్ ట్రీని అలంకరిస్తారు.

ఆ శుభ ఘడియ కోసం ఎదురు చూస్తున్నాం

క్రిస్మస్ మానవాళికి శుభదినం. క్రీస్తు ప్రబోధించిన సుగుణాలు, పరిశుద్ధత, పవిత్రత, తగ్గింపు స్వభావం, ప్రేమ, త్యాగం, దయా గుణాలు అలవరుచుకోవడమే క్రిస్మస్ సందేశం. అందువల్ల ఆ శుభ ఘడియకోసం వేయికళ్లతో ఎంతో సంతోషంగా ఎదురు చూస్తున్నాం. రెవరెండ్ జీఎం విక్టర్ మోజెస్, సంఘకాపరి, క్రీస్తు కృపాలయం, పెదకాకాని.



పొన్నూరులో విద్యుత్ అలంకరణలో క్రీస్తు శతవార్షిక లూథరన్ దేవాలయం



పొన్నూరు మార్కెట్లో విక్రయానికి ఉంచిన క్రిస్మస్ అలంకరణ వస్తువులు

చర్చిలు ముస్తాబు

పొన్నూరు: మండలంలో క్రిస్మస్ సందడి నెలకొంది. సెమీ క్రిస్మస్ పేరిట ముందస్తు వేడుకలను క్రైస్తవులు ఆనందంగా జరుపుకుంటున్నారు. ఇప్పటికే చర్చిలన్నీ విద్యుద్దీపాల వెలుగులతో మెరిసిపోతున్నాయి. క్రైస్తవులంతా చర్చిలను, తమ ఇళ్లను ఇప్పటికే ప్రత్యేకంగా అలకరించారు. క్రిస్మస్ ట్రీలు, నక్షత్రాల ఏర్పాటుతో శోభాయమానంగా దర్శనమిస్తున్నాయి. పాత పొన్నూరులోని క్రీస్తు శతవార్షిక లూథరన్ చర్చి, తదితర ప్రాంతాలలోని చర్చిలు విద్యుత్ కాంతులతో ఆకట్టుకుంటున్నాయి. పలు స్కూళ్లలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. క్రిస్మస్ సంబంధించిన సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లో సందడి నెలకొంది.

అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలి

అదనపు కమిషనర్ ఓబులేసు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ ఓబులేసు

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్‌ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలు రీ ఓపెన్ కాకుండా సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 18 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలని కోరారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని కోరారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని చెప్పారు. సోమవారం ప్రజల నుంచి 42 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 11, ఇంజినీరింగ్ విభాగానికి 10, రెవెన్యూ విభాగానికి 7, ప్రజారోగ్య విభాగానికి 12, పరిపాలన విభాగానికి 1, ఉపా సెల్ విభాగానికి 1 చొప్పును ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ స్థలాన్ని ఆక్రమించుకుని దానిలో డెవలప్‌మెంట్ కోసం(అపార్ట్‌మెంట్ నిర్మించేందుకు) సదరు స్థలాన్ని వేరే ప్రైవేట్ కంపెనీకి కూడా ఇవ్వడం జరిగిందని గుంటూరు స్తంభాలగరువుకు చెందిన పంచుమర్తి శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం నగరపాలక సంస్థ పీజీఆర్‌ఎస్‌లో అదనపు కమిషనర్ ఓబులేసుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్తంభాల గరువులో నగరపాలక సంస్థ స్థలం, పొరంబోకు స్థలం సుమారు 500గజాల దాకా ఉందని, దీనిని అనుకుని 1276 గజాల స్థలాన్ని వేరే వ్యక్తులు కొనుగోలు చేశారని...దీని పక్కనే ఉన్న సుమారు 500 గజాల స్థలాన్ని కూడా ఆక్రమించుకుని చుట్టూ ప్రహరీ గోడ నిర్మించుకున్నారని, దీంతో పాటు స్థలం ముందు 9 అడుగుల రోడ్డును మూసివేసి మా స్థలాన్ని కొంత భాగం అక్రమించుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం సదరు స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మించేందుకు శంకుస్థాపన కూడా జరిగిందని, అధికారులు స్పందించి తన స్థలాన్ని తనకు ఇప్పించడంతో పాటు, నగరపాలక సంస్థ స్థలాన్ని కాపాడాలని ఆయన కోరారు.